# దొరగారి 'గడి'

రకరకాల చెక్కడంతో, సింహం ముఖంతో దొరగారి 'గడి' వైభవానికి చిహ్నంగా ఉందా ఇంటి పెద్దరువాజ... సాగబారిన టేకు కర్రతో తయారు చేయబడిన సింహద్వారం ఆ గడి వైభవాన్ని మరింత చాటుతుంది.

దర్వాజ కెదురుగా అరుగు మీద పడక కుర్చీలో కూర్చొనున్నాడు కిషన్‌రావు దొర. ఎత్తు, లావైన శరీరానికి బుర్ర మీసాలుతోడై అతనికి గంభీరతను చేకూర్చాయి. అతని చూపులు డేగ చూపుల్లా ఉన్నాయి. అతనికి కొంచెం దూరంలో ఎడమ ప్రక్కన దొర షేరిదార్ గోపాలరావు చాప మీద కూర్చొనున్నాడు. అతని ముందో చిన్న బల్లుంది. దాని మీద దత్తురముంది. పక్కన ఇంకో రెండు దత్తురాలున్నాయి.

దొర భూములను చేపాలుకు (అరవ భాగం) సేద్యం చేయిస్తాడు గోపాలరావు. దొరకు సంబంధించిన అదాయ వ్యయాలు, వడ్డీ వ్యాపార విషయాలతో సహా అన్ని వ్యవహారాలనూ గోపాలరావే చూస్తాడు. అతన్నందరూ 'పంతులూ' అని పిలుస్తారు. ఆ ఇంట్లో గుడికి పూజారిలాంటివాడు గోపాలరావు.

వంట గదిలో వంట పంతులు వంట చేసే హడావిడిలో ఉన్నాడు. దొరసాని అతనిపై అజమాయిషీ చేస్తోంది. ఇంటి నిండా దాస దాసీ జనాలు ఎవరి పనుల్లో వాళ్లు మునిగున్నారు. సింహద్వారం దగ్గర బరిసె చేతిలో పట్టుకొని సుంకరి దొరగారి అజ్ఞకొరకన్నట్టుగా నిల్చొనున్నాడు. ఆ గ్రామస్థు లిద్దరు 'పబ్బతి' పట్టుకొని దొర చూపు తమ మీద పడటానికెదురు చూస్తున్నారు.

గోపాలరావు ఏవేవో లెక్కలు చేస్తున్నాడు.

దొర అరుగు మీదున్న గుమ్ముల దిక్కు చూసాడు. అవి దొరకంటే కూడా గంభీరంగా ఉన్నాయి. వాట్లో పుట్లకొద్దీ ధాన్యముంది. చిన్న దొరసాని నెత్తుకొని ఓ ముసలామె అటూ ఇటూ తిరుగుతుంది.

దొర చూపు దరువాజ బయట నిల్చున్న వ్యక్తిపై పడింది. దండంబెడుతూ లోపలికొచ్చాడతను. అతని చేతిలో తలకు చుట్టుకునే రుమాలుంది. భయం భయంగా నిల్చునున్నాడతను.

"ఈరిగా! గుట్టల కింది పొలం మంచి గున్నాదిర..." అడిగాడు కిషన్‌రావు.

"దొరా! కొంచెం పురుగుపట్టింది..." అన్నాడు ఈరయ్య.

"మరి నువ్వేం నీరటితనం జేత్తన్నవురా...?"

"గది జెప్పుదామనే అచ్చిన బాంచెను..."

"నీళ్ళు సరిగ్గ అందుతున్నయా లేదా...?"

"మీ పొలానికందకుంటెట్లుంటది దొర...?" ఎట్లనో తిప్పలపడి పారిత్తన్న..."

"సరె పో.." దొర చెప్పినా నసుగుతూ నిల్చున్నాడు ఈరయ్య.

"ఏందిరా..? ఏం గావాలె..?" అన్నాడు.

"దొరా." "దొర నా జీతం గొలువ లేదు..."

"అట్లనా..." అని, "పంతుల్నడిగి కొంచవో..." అన్నాడు దొర.

"రేపచ్చి కొంచవోత..." అంటూ వెళ్లిపోయాడు ఈరయ్య.

చెప్పులు బయటే విడిచి తల రుమాలు చేతిలో పట్టుకొని దొరకు దండం బెడుతూ లోపలికొచ్చాడు కొంరయ్య.

"కొంరా? చాకలి బక్కి సంగతేమైందిరా...?"

"గది జెప్పుదామనే అచ్చిన బాంచెను. దాన్ని మొగుడు తీసుకపోతలేడు."

"బాగ బలుపచ్చిందా గాడిది కొడుక్కు... ఎందుకట..."

"గాచెడిపెయిందాన్ని తీసుక పోనంటండు..."

బక్కమ్మను పాడుజేసింది దొరమిత్రుడు రాంరెడ్డేనన్న విషయం దొరతోపాటు ఊరందరికీ తెలుసు.

"సాకలోనిగ్గాడ గివ్వన్నీ కావన్నా... ఆ బాలిగాన్ని రమ్మను నేంజెప్పుత..." అన్నాడు కిషన్‌రావ్.

"రమ్మంట దొరా..." అని వంగి వంగి దండాలు పెడుతూ వెళ్ళిపోయాడు కొంరయ్య.

"పంతులూ! గా కుమ్మరోడు బాకి గట్టిండా...? లేదా...?"

గోపాలరావు తల పైకెత్తి చూసాడు.

"ఇంకా పూర్తిగియ్య లేద్దొర..." అన్నాడు.

"మరి నువ్వేం జేత్తన్నావు...? గడ్డి పీకుతున్నవా...?"అని –

"అరె సాయులూ, అన్ని గొర్రగొర్ర గుంజక రాపో... లేకుంటే నాగటెడ్లిడుసుకరా..." అన్నాడు కిషన్‌రావు.

"తీసుకత్త దొరా!" అని బరిసె కుడి చేతిలోకి తీసుకొని గబ గబా బయటకు వెళ్లిపోయాడు సుంకరి.

"పంతులూ! సవారి బండి గట్టిచ్చు. పెరడి కాడికి పోదాం..." అని కుర్చీలోంచి లేచి ఇంట్లోకెళ్ళాడు కిషన్‌రావు. అతడు బయటకొచ్చేసరికి సవారెడ్లబండి పెద్దరువాజ ముందు సిద్ధంగా ఉంది. కిషన్ రావొచ్చి బండ్లో కూర్చున్నాడు. అతని వెనుకే గోపాలరావు బండెక్కాడు. పాలేరు బండెక్కి నొగల దగ్గర కూర్చున్నాడు. బండి ముందు చాకలి పరుగెత్తుతున్నాడు. అది నడి ఊరే అయినా కేవలం సవారు బండిని లాగడానికి మాత్రమే ఉపయోగపడే ఆ కోడెలు వేగంగా పరుగెత్తుతున్నాయి. వాటితో సమానంగా పరుగెత్తుడానికి చాకలి ఆయాసపడుతున్నాడు. దొరబండి బజార్లోకి రావడం చూస్తూనే అంతా పక్కలకు తప్పుకుంటున్నారు. దొర చూసినా చూడకున్నా వంగి వంగి దండాలు పెడుతున్నారు. పడుచు స్త్రీలు ఇండ్ల

లోపలికెళ్తున్నారు. ఆ బండికి ఎదురొచ్చి చనిపోయినా దిక్కులేదన్న విషయం తెలుసు కాబట్టి ఎవరూ ఎదురు రావడానికి ప్రయత్నించడం లేదు. పది నిముషాల్లో బండి ఊరు దాటి ఊరు పక్కకున్న పెరడి దగ్గరాగింది. పెరడి దగ్గరున్న పాలేరు పరుగెత్తుకుంటూ వచ్చి దండం పెట్టి నిల్చున్నాడు. గోపాలరావు, ఆ తర్వాత దొర బండి దిగారు. పాలేరు వెంట నడుస్తుంటే దొర, గోపాలరావు పెరడంతా తిరిగి చూసారు. వాళ్ళు బావి గడ్డ కొచ్చేసరికి చాకలి తుమ్మ పొరకను మంటబెట్టి పచ్చి కంకులు కాలుస్తున్నాడు. దొర, గోపాలరావు అక్కడ కూర్చొని, తినేవరకు తిని లేచారు.

బండి ఇల్లు చేరేసరికి చాకలి బాలయ్య ఇంటి ముందు కూర్చొనున్నాడు. దొరను చూస్తూనే లేచి నిల్చున్నాడు.

"బాగ కావురమచ్చినాదిర బాలిగ..." అని వారుగట్టెతో బాలయ్య వీపు మీద నాలుగు దెబ్బలేసాడు కిషన్‌రావు.

"నీ పెండ్లాన్నుంచుకోకుంటె ఊళ్లుండవు..." అని చెప్పి లోపలి కెళ్ళిపోయాడు కిషన్‌రావు.

☆ ☆ ☆

అరుగు మీదున్న పట్టె మంచంలో కూర్చొనున్న గోపాలరావు కళ్ళ ముందు దొరతో గడిపిన జీవితం కదిలింది. అతని చేతిలో ఉన్న దొర రాసిన ఉత్తరం నలిగిపోతోంది.

గోపాలరావు ముఖంలో వయసుతో వచ్చిన ముడతలతో పాటు నిర్లిప్తత. దొర, దొర వైభవం జ్ఞాపకం వచ్చి అతని మనసు దుఃఖంతో మూల్గింది.

ఎల్లితే ఎల్లాపు, లేకుంటే గులాపులాంటి సూటి పోటి మాటలతో అప్పుడప్పుడు దొర, దొరకు సంబంధించిన వాళ్ళు తనను దెప్పేవాళ్ళు. అవమాన పరచేవాళ్లు. అయినా దొర ఊళ్ళో ఉన్నన్ని రోజులు తనకు వైభవంగానే సాగింది. కొంతమంది సంపన్న కుటుంబాల వాళ్ళు తప్ప తన నూరివాళ్ళందరూ గౌరవించే వాళ్ళు. దొరతో ఏ పని కావాల్సి వచ్చినా తన ద్వారానే పోవాల్సివచ్చేది.

"దొరగారి గడి... దొరగారి గడి..." రెండు మూడుసార్లు గొణుక్కున్నట్టు తనలో తనే అనుకున్నాడు గోపాలరావు.

గడిలో, ఊళ్ళో దొరదెంత వైభవం? ఊరి వాళ్లంతా దొర గడీ ముందే బతుకమ్మాడాలి. దొర బతుకమ్మ పెట్టిం తర్వాతే మిగతా వాళ్ళంతా పెట్టాలి. దొరగారి బతుకమ్మ కంటె ఎవరి బతుకమ్మ పెద్దగా ఉండడానికి వీల్లేదు. చద్దుల బతుకమ్మ రోజున ఇద్దరు లేపినా లేచేది కాదు బతుకమ్మ. దాన్ని చెరువు దగ్గరి వరకు మోయడానికి ఇద్దరు పాలేర్లు సతమతమయ్యేవారు.

ఊళ్ళో దొరచెప్పిందే వేదం... దొర మాటే శాసనం. ఊరి పంచాయతులన్నీ దొర గడి ముందే... తుది తీర్పు దొరదే.

దొర కన్నుపడ్డ స్త్రీ శీలాన్ని కాపాడుకోవడం కష్టం. దొరచేతిలో ఎన్ని అధికారాలు?

దొర ఊర్ను ఏకచ్ఛత్రాధిపత్యంగానే ఏలాడు, దొర అధికారాలను, గడి వైభవాన్ని జ్ఞాపకం చేసుకున్నాడు గోపాలరావు.

కాని, ఎంతలో ఎంత మార్పు?

ఆ ప్రాంతంలో ఉవ్వెత్తున లేచిన ఉద్యమాల వల్ల దొర, దొరలాంటి వాళ్ళ అధికారాలకు గండి పడింది. చాలా మంది దొరలు ఊళ్ళనే వదిలిపెట్టి పోవాల్సిన పరిస్థితేర్పడింది. కిషన్‌రావు ఊరొదిలి పదిహేనేళ్ళయింది. చాలా వరకు భూములమ్ముకున్నాడు. ఇంకొన్ని భూములు, ఇల్లున్నాయి. వాటిని అమ్ముకోవడం సాధ్యం కాలేదు. గడి మీద జెండాలు పాతారు. పోలీసులు యువకులను అరెస్టు చేసారు. ఓ యువకుడు చనిపోయాడు కూడా. అయినా వాళ్ళు భయపడలేదు. ఆ ప్రాంతమంతా అగ్ని గుండంగా మారింది.

రెండు మూడేళ్ళుగా పోరాటాల ఉధృతం కొంత తగ్గింది. కొంతమంది దొరలు ఎలాగోలా ఊళ్ళలోకి తిరిగొచ్చారు. ఈ పరిస్థితి చూసే కిషన్‌రావు దొర ఊరికి తిరిగొస్తానంటున్నాడు.

'దొర ఊళ్ళోకి తిరిగొచ్చే పరిస్థితులున్నాయా?' తనను తనే ప్రశ్నించుకున్నాడు గోపాలరావు.

దొర రాసిన ఉత్తరాన్ని మరోసారి చదువుతున్నాడు!

"గోపాలరావుగారికి–

నమస్కారం!

ఊళ్ళో పరిస్థితులు మునుపటికంటె కొంత మేలుగా ఉన్నట్టే అర్థమవుతుంది. ఇక్కడ ఆర్థికంగా నాకేం లోటు లేదు. రెండిండ్లున్నాయి. కిరాయి లొస్తున్నాయి. పెదబాబు సినిమా హాలును నడిపిస్తున్నాడు. చినబాబు కాంట్రాక్టర్. అమ్మాయి పెళ్ళైంది. ఈ విషయాలన్నీ మీకు తెలియనివి కావు.

అయినా నాకిక్కడ ఉండాలనిపించడం లేదు. ఏ లోటూ లేకున్నా ఆ జీవితం దొరకడం లేదు. ఇక్కడ ఒకర్నొకరు పట్టించుకున్న వాళ్ళు లేరు. పోగా ఊళ్ళో పుట్టి, పెరిగి, ఎంతో వైభవంగా జీవితం గడిపిన నాకు మిగతా జీవితమక్కడే గడపాలనిపిస్తుంది. నీలాంటి విశ్వాసపాత్రులు, ఆత్మీయులైన మనుషు లెంతోమంది నాకక్కడున్నారు. నేనొచ్చి మునుపట్లా సాగించుకుంటానని అనుకోవద్దు. చాలా మామూలుగానే బతకడానికి నిర్ణయించుకున్నాను. నాకు ఊరిపై మమకారం పోలేదు.

మా పిల్లలు ఊరికి రావడానికిష్టపడకున్నా నేను, దొరసాని రావాలనుకుంటున్నాం. 'గడి' నివాస యోగ్యంగా ఉందో లేదో చెప్పు... అక్కడి పరిస్థితులు మేము రావడానికి అనుకూలంగా ఉన్నాయో లేదో తెలుపు. ఈ ఉత్తరం ముట్టిన తర్వాత నువ్వొక్కసారిక్కడకు రా... లేదా వివరంగా ఉత్తరం రాయి.

ఉంటాను

మీ కిషన్‌రావు దొర."

ఉత్తరం మడిచి లాల్చీ జేబులో పెట్టుకున్నాడు గోపాలరావు. అతని మనసు భారమైంది. ఏవేవో జ్ఞాపకాలాతనిలో సుళ్ళు తిరిగాయి.

లేచి నిల్చున్నాడు గోపాలరావు. పంచె భుజమ్మీద వేసుకున్నాడు. కాళ్ళకు చెప్పులేసుకొని దొర గడి దిక్కు నడుస్తున్నాడు.

తన నలభై ఏళ్ళ జీవితం దొర కుటుంబంతోనే గడిచిపోయింది. తాను పెద్దగా సంపాయించుకోకున్నా బాగానే గడిచింది. దొరతో పాటు తనకూ కొంత గౌరవం లభించింది. ఇప్పుడు దొర ఊళ్ళోకొస్తే తనలాంటి వాళ్ళకు మంచిదే. కాని దొర భావించినట్టు ఊళ్ళోకి అతడొచ్చే పరిస్థితులున్నాయా? ఆలోచిస్తూ దొర గడి దిక్కు నడుస్తున్నాడు.

అంబటి వేళ సమయం దాటుతుంది. ఊళ్ళో చాలా మంది భోజనాలవి ముగించారు. పశువులను మేపడానికై పిల్లలు వాట్నీ తోలుకొని చెలుకలకెళ్ళారు. చాకలివాళ్ళు ఊరు దిరిగి అన్నమవీ అడుక్కొని మురికి బట్టలు తీసుకొని వెళ్ళిపోయారు.

దొర గడి దగ్గరకు చేరుకున్నాడు గోపాలరావు.

ప్రహరీ గోడ చాలా చోట్ల కూలిపోయింది. కొన్నిచోట్ల తవ్వబడుంది, ప్రహరీ గోడలోపలున్న ఖాళీ ప్రదేశం అడవిలా ఉంది... తుప్పలతో, చెత్తాచెదారంతో పెంట కుప్పలా ఉంది.

కళ కళలాడుతూ ఉండే 'గడి' బోసిపోయినట్టుంది. గోడలు బిచ్చులూడిపోతున్నాయి. పెద్దరువాజపైన ఎప్పుడో యువకులు పాతిని జెండకర్ర చీకిపోయింది. సింహద్వారం తలుపులు చాలా కాలం నుంచే లేవు. పాడుబడి పోయిన దయ్యాల కొంపలా ఉంది గడి. అందులో ఒకప్పుడు మనుషులుండే వారంటే నమ్మలేకుండా ఉంది. బయట రెండెడ్లు పడుకొని నెమరువేస్తున్నాయి.

ఆ గడిని చూసిన గోపాలరావు ముఖం అదోలా మారింది. హృదయపు లోతుల్లో కెలికినట్టయింది. ఒకప్పటి గడి వైభవం జ్ఞాపకం వచ్చి అతని హృదయం భారమైంది. దొర వెళ్ళిపోయినప్పట్నుంచి అక్కడ కొచ్చినప్పుడల్లా గోపాలరావు బాధకు గురవుతూనే ఉన్నాడు.

పెద్దరువాజ దాటి లోపలికడుగు పెట్టాడు గోపాలరావు. లోపలి తలుపులు కూడా కొన్ని లేకపోవడం చూశాడు.

ఏడెనిమిది మంది అరుగు మీద కూర్చొని ఏమేమో మాట్లాడుకుంటున్నారు. అందులోంచి నలుగురు పేకాడుతున్నారు. ఒకరిద్దరు సిగరెట్లు పీలుస్తున్నారు. ఒకడు మందుకొడుతున్నాడు.

గోపాలరావును చూడగానే అందులో ఒకతను "చంచాగాడొస్తున్నాడు. దొర చంచాగాడొస్తున్నాడు" అన్నాడు.

మిగతా వాళ్ళంతా "హి...హి...హి..." అంటూ బిగ్గరగా నవ్వారు.

"దొరచంచా... దొరచంచా... దొరున్నప్పుడు గీ పంతులు పటాటోపం కొద్దా...?" అన్నాడు మరో యువకుడు.

"బాగా బలిసినా్రర! గా పంతులేమంటడని వత్తి వత్తిగనే తిడుతంవ్రడు? అయినె మీ జోలికన్నచ్చిండా?" వాళ్ళను కసురుతూ అన్నాడు అక్కడే ఉన్న వృద్ధుడు లింగయ్య.

"నీ యవ్వ - ముసలోడ... నీదేం బోతంది? నీకేమన్న చుట్టమా పంతులు?" వృద్ధుడ్ని కసిరాడు మరో యువకుడు.

గోపాలరావుకు యువతరాన్ని చూస్తుంటే భయంతో పాటు సంతోషమూ కలుగుతుంది. ఎన్ని విపత్తులనైనా ఎదుర్కొనే ధైర్య సాహసాలున్న యువతతోపాటు లంపెన్‌గా వ్యవహరించే యువకులుండటం గమనిస్తున్నాడతను.

"లింగయ్యా! ఊర్కో" అన్నాడు వృద్ధునితో గోపాలరావు.

"ఏమూకుండుడు బాబు... ఈ పోరగాండ్లకు కన్ను మిన్నేర్పడుత లేదు. ఎంటికె పీకేత్తే కాసేదో, మొదలేదో తెలువకున్నా అన్ని తెలిసినట్టే మాట్లాడతరు. అట్టిగనే మీతోని గిచ్చి కయ్యం బెట్టుకోవట్టిరి..." అన్నాడు లింగయ్య బాధగా.

"షేరిదారు మీన లాన్సు ప్రేమ ముసలోనికి. అయితె మానాయె గని పంతులుకు గిటుదారి పడ్డదేంది...?"

"దొర పోయినంక పంతుల్దారి గోదారైంది. అప్పుడప్పుడచ్చి గడిని చూసుక పోతడు..."

"అబ్బో, పంతులు పెద్ద చంచాగాడు. ఎప్పటికప్పుడు దొరకు రిపోర్టు పంపుతడు..."

రకరకాలుగా దెప్పుతున్నారు యువకులు.

గోపాలరావు అక్కడే ఉన్న మొగురాని కొరిగి కూర్చున్నాడు.

"అయితే మానాయెగని పంతులెందుకో వత్తివి" అన్నాడొకతను.

"దొర ఊళ్ళో కొస్తాడట. ఉత్తరం రాసిండు."

గోపాలరావు మాటలు విని పేకముక్కలు కింద పారేసారు. అక్కడున్న చాలామంది ముఖాల్లో వినకూడని మాటలు వింటున్నామన్న భావముంది. లింగయ్యలాటి ఒకరిద్దరికి మాత్రం దొరవస్తే బాగానే ఉంటుందనిపిస్తుంది. కొద్ది క్షణాలెవరూ మాట్లాడలేదు.

"ఇక్కడేముందని వస్తడు దొర?"

"దొర రావద్దా ఊరుకు? నువ్వే ఊర్ను పొందిచ్చినవా? నీదే ఊరని రాగిసన్నతుల మీన రాసుందా?" అన్నాడు లింగయ్య.

"అవు మరి, ఊరు మాదే. మా అసోంటల్లదే. మట్టె మట్టె పని జేసెటోందే ఊరు... భూమిని దున్ని పంట పండించెటోందే ఊరు. కూసుండి తినెటోంది కానే కాదూరు. అక్కడ కల్లు, బరండి దుకాణాలు పెట్టుకోని బతుకుతంద్రు గద దొరలు, గట్లనే బతుకక గిక్కడకెందు కచ్చుడు?"

"గవ్వి బందు జేసింద్రు గద... గందుకే వత్తనంటండేమొ...?"

ఆ మాటల కంతా హేళనగా నవ్వారు. గోపాలరావు ముఖం చిన్నబోయింది.

"ఇంతకు దొర ఊరికేమన్యాయం చేసాడు? దొరనెందుకు రావద్దంటున్నారు? ఆయన మీద ఇంత కక్షెందుకు?" అన్నాడు గోపాలరావు.

ఆ మాటలు విని ఆగ్రహంతో లేచి నిల్చున్నాడో వ్యక్తి.

"ఏం జేసిండో నీకు తెలువకనే అడుగుతున్నావా పంతులు?" మంచోనివే ఉన్నవు. వడ్డీల పేరు మీన ఈతాకిచ్చి తాటాకు దొబ్బిండు... వడ్డికి పావుశేర్న కొల్సుకున్నడు... గసోంటి షావుకార్లకే మద్దతిచ్చిండు. పాప దోష మనక అందర్ని సంపుక తిన్నడు. బంగ్లాలు గట్టిండు... గసోంటి దొరను పాపమనుడా...?" అన్నాడు.

"గిప్పుడు బాగ మంచిగైందని మిడటిసిపడతండ్రా? గప్పుడు ఏ రాత్తిరి పోయినా ఆపదకు, సంపదకు, పండగకు, పబ్బానికి, అక్కెరకు పైసలు దొరకేటియి. తక్కువో, ఎక్కువో మిత్తికన్న దొరకేటియి... మరి గిప్పుడు...? మనిషి సత్తండన్నా ఇచ్చెడోటు లేకుంటైతండు.. బాగ సంపాయించుటానికెగవద్దరు. .. గవ్వేవో షేర్లట గద గండ్ల పెట్టుకుంటండ్రు... దొర, షావుకార్లిచ్చిన మిత్తి ఎక్కో ఐనాది...? గిప్పుడేమో తక్కో ఉందా? ఆపదల్ల, సంపదల్ల పైసలిచ్చేటోల్లను ఊళ్లెకెళ్ళి ఎల్లగొడ్తిరి. అమ్మ పెట్టది, అడుక్క తిననీయదన్నట్టుంది సంగతి..." అన్నాడు లింగయ్య.

ఆ మాటల్లో కొన్ని ఆలోచించాల్సిన విషయాలున్నట్టనిపించినా దొర లాంటివాడు మళ్ళీ ఊళ్ళోకి రావడం వాళ్ళకు నచ్చడం లేదు. దొరను ఊళ్ళోకి రానివ్వడమంటే కొరివితో తల గోక్కున్నట్టేననిపిస్తుంది వాళ్ళకు.

"పోరా... ముసలోడపో... దొర ఎంగిలి మెతుకుల కాశపడే నీలాంటోల్లకు దొర మంచిగనే కనబడ్తడు. దొరట, పెద్ద పోటుగాడట... ఊరికి సాయం జేసిండట. అయినె ఊరికి సాయం జేత్తె అయిన గుమ్ములు, గరిసలే ఎట్ల నిండినయి...? మా చెమట రక్తం తాగిండు దొర... అయినె ఊళ్ళో కచ్చేది లేదు. ఊరంటె ఇప్పుడు కష్టపడెటోందే...!" అన్నాడో యువకుడు.

"దొరచ్చి ఈ గడీల మల్ల ఉంటడా...? మల్ల దీన్ని రావణ లంకంజేత్తడా...? ఈ గడి పాడుగాను. ఇదో పాపాల పుట్ట... ఇక్కడ ఎందరి ఆడోల్ల జీవితాలు నాశనమైనాయి...? ఎంతమంది పసుపు కుంకుమలు పాడైపెయినయి...? ఎంత మందిని మొగురానికి కట్టేసి కొట్టిండు దొర...? మల్ల ఏ మొకం బెట్టుకొని ఊళ్ళో కొత్తనంటండు...?"

"దొర పడుసుతనంలున్నప్పుడు ఊళ్ళే సముర్తయినాడిది మొదలు దొర దగ్గరికి పోవాల్నాయె... పేదోనికి మంచి పెళ్ళాముండద్దాయె..."

"చాకలి రాముడు దొర కచ్చురం ముంగట ఉరికి ఉరికి మొసచ్చి చచ్చిపోతే అడిగినోల్లెవ్వలు...?"

"దొర బిడ్డతోని మాట్లాడిండని సాలె శంకరయ్య కొడుకును సావజంపిండు దొర... దొర బిడ్డేమొ గంత మానవతి – మా ఆడోల్లేమొ బట్టలు గట్టుకుంట లేరా...?"

ఆవేశంగా దొరపై వ్యతిరేకతను తలో విధంగా వెళ్ళగక్కుకున్నారు. వాళ్ళ మాటలను కాదనడానికి గోపాలరావు దగ్గర ఏ ఆధారాలు లేవు. అట్లని దొరలు ఊళ్ళలోంచి వెళ్ళి పోయింతర్వాత అంతా బాగనే ఉందని అనుకోవడానికి అతని మనసంగీకరించడం లేదు. కొద్ది సేపు వాళ్ళను మాట్లాడనిచ్చి

"అవన్నీ ఎప్పుడో జరిగిన సంగతులు... ఇప్పుడు ఎంత దొరైనా అలా చేయడానికి ధైర్యం చేయడు. ఊళ్ళె కొచ్చినా వాళ్ళిప్పుడు కోరలు దీసిన పాముల్లానే ఉంటారు. వాళ్లనుంచేం గాదు..." అన్నాడు.

"కోరలు తీసినా, ఉన్నా పాము పామే కదా! దాని గుణమేడ బోతుంది...? మల్ల ఈ పాములు ఆ పాముల కంటె గూడ భయంకరమైనవి. తేలుకు తోకకు, పాముకు తలలో విషముంటే వీళ్ళకు శరీరమంతా విషముంటుంది. వీళ్ళను నమ్మద్దు..." అన్నాడు ఖచ్చితంగా ఓ వ్యక్తి.

"తవ్వుతూ పోతే అన్నీ పెంకలే వెళ్ళుతాయి. దొర తన తప్పులకిప్పుడు పశ్చాత్తాప పడుతున్నాడు. అతడు తప్పు చేయ లేదనడం లేదు. అట్లని ఊళ్ళో ఉండే హక్కు దొరలాంటి వాళ్ళకు లేదా...?" అన్నాడు గోపాలరావు.

– "హక్కట హక్కు... ఎట్లా హక్కుంది దొరకు...? అతనేమన్న నాగలి దున్నిండా...? మోటగొట్టిండా? బంతిగట్టిండా? జంబుగొట్టిండా? పుట్ల కొద్ది పంట పండటానికాతని దొక్కు చెమట బొట్టైన రాలిందా...? ఈ మట్టె మా చెమటుంది. మా రక్తముంది. మరతనికీ నేల మీద ఏ విధంగా హక్కుంది...? ఊరందరికి ఉపయోగపడే చెరువు నీళ్ళను పైసలు దీసుకొని పొరుగూరోల్ల కమ్మిండు... దేవుని భూమిని తానే అనుభవించిండు. హక్కుందట హక్కు..." కోపంగా అన్నాడో వ్యక్తి.

"పంతులూ! నీ అసోంటి ఎంగిలి మెతుకుల కాశపడేటోల్లుండబట్టే కొందరు దొరలూళ్ళెకస్తున్నరు. అయినా నాకు తెలియకడుగుత... దొర మీద నీ కెందుకింత ప్రేమ...? దొర నిన్ను తన అవసరానికి వాడుకున్నడే తప్ప నీ కేమొరిగిందయినెతోని. తన బిడ్డ వయసున్న నీ బిడ్డతోని దొర పరాచికాలాడేటోడన్న సంగతి నీకు తెలువదా...? అలాంటి వాన్ని ఊళ్ళోకి రమ్మనడానికి నీకు మనసెట్లా ఒప్పుతుంది...?"

ఆ మాటలు గోపాలరావు హృదయంపై సమ్మెట. పోట్లలా పడ్డాయి. తన కూతురు తన కోసం దొర ఇంటికొస్తే తాను విల విల లాడిపోవడం, దొర బారి నుండి ఆమెను కాపాడటానికి తాను పడ్డ పాట్లు జ్ఞాపకం వచ్చి అతని శరీరం వణికింది. అదృష్టవశాత్తూ తన కూతురు దొర దౌర్జన్యానికి గురి కాకపోవడం అతనికి కొంత ఊరటగా ఉంది.

గోపాలరావు తలవంచుకొని ఏం మాట్లాడలేదు.

"దొర వ్యవసాయం 'చే'పాలుకు చేయించి, అప్పు పత్రాలు రాసి అన్నీ నువ్వే అయి చేస్తే ఏపాటి సంపాయించుకున్నవు? విశ్వాసం గల కుక్కలా పడుంటే నీకే మొరిగింది? నీ అసోంటోన్ని దొరలు పైకి రానియ్యరు. అయినా నీకు దొరంటే ప్రాణం. నిన్నెంత మంది దొర చొల్లు నాకే కుక్కని తిట్టేటోల్లో నీకు తెలువది..."

తన పరిస్థితిని విడమర్చి చెబుతున్న తన ఊరి వాళ్లను ఆశ్చర్యంగా చూస్తున్నాడు గోపాలరావు. వాళ్ళింకేదో మాట్లాడుతూనే ఉన్నారు... అందులో ఎన్నో నగ్న సత్యాలుండటం గమనిస్తున్నాడు.

అయితే, గ్రామాల్లో ఈ మధ్య వచ్చిన మొత్తం మార్పుల నాతడు జీర్ణించుకోలేకపోతున్నాడు. దొరల జులుం లాటివి మాయమవడం హర్షింపదగినవే అయినా, మనుష్యుల మధ్య ఇదివరకున్న సంబంధాలు, నా ఊరనే భావన, నా వాళ్ళనే అభిమానం లాంటివి దూరమవుతుండటం అతనికి బాధాకరంగా ఉంది.

"అల్లదెవల్దో జులం జూసుకోని చెంగు చెంగు నెగిరిండ్రు. తాటాకు మంటలోలె అల్లు తుస్సుమన్నరు. మూతి మీద మీసం రానోడు గూడ, దొర్లున్నప్పుడు ఏలెడంత లేనోడు గూడ దొర నూల్లెకు రావద్దనుడే... దొరెందుకూ పల్లెకు రావద్దుర్రా...?" అన్నాడు లింగయ్య కోపంగా...

"పోర ముసలోడ...! కుక్కతోక వంకరే... నీ అసోంటోల్లకెన్ని జెప్పినా గంతే... పెద్దోల్ల మూతులు నాక్కుంటనే ఉంటనంటరు.. అవ్వి తాటాకు మంటలు గాదురా... నెగళ్ళ మంటలు... అవ్వట్ల మండతనే ఉంటయి... ఇప్పుడేం ఉద్యమాల్లెవ్వని మురిసిపోకుండ్రి... నివురుగప్పిన నిప్పోలుంది పరిస్థితి... ఎప్పుడు భగ్గుమంటదో తెలువది... దొరలు ఊళ్ళళ్ళకచ్చి ఏదో సాగించుకుంటరనుకోకుండ్రి..." కోపంగా అన్నా డక్కడున్న మధ్యవయస్కుడు.

తెలంగాణా గ్రామాల్లో ఇప్పుడున్న పరిస్థితిని విశ్లేషించి చెప్పిన అతని మాటల్లోని సత్యాన్ని గూర్చి అంచనా వేస్తున్నాడు గోపాలావు. కొద్ది క్షణాలాగి–

"పరిస్థితులు దొరల కనుకూలంగా ఉన్నాయని నేను చెప్పడం లేదు... అయినా వాళ్ళొస్తనంటే మీకెందుకంత జడుపు...?" అన్నాడు.

"భయం కాదు. అనుభవంతోని చెప్పుతున్న... వాళ్ళచ్చి కుక్కిన పేన్లోలె పడుండరు. జుట్లు ముడేత్తరు... కులాలు, మతాలు, ఇంకెన్నో పేర్ల మీన మనల్ని విభజిస్తరు. వాళ్ల పబ్బం గడుపుకుంటరు. పుక్కానికి బతుకుతరు..."

ఆ మాటల్లో నిజమున్నా యువకులు కూడా తమలో తాము తగాదాలు పెట్టుకోవడం గోపాలరావు చూస్తున్నాడు.

"మీరు కొట్టుకుంటలేరా పార్టీల పేరు మీన... మీ కిష్టమైంది మంచి... నచ్చంది చెడు..." అన్నాడు గోపాలరావు.

"ఓ వైద్యుడు బైల్దేరిండు మాకు చెప్పటానికి!"

"ఇదుగో మీరావేశంలో ఉన్నారు. నేను జీవితానుభవాలతో చెప్తున్నాను. దొర ఊళ్ళోకి వచ్చినా మునుపట్లా సాగించుకునే అవకాశాల్లేవు. దొర వస్తానంటే మీరభ్యంతరం చెప్పకండి. దొర లేకుంటే గడి ఎలా చిన్నబోయిందో చూడండి. అయనుంటె ఎలా కళకళలాడేది!" అన్నాడు గోపాలరావు చివరి ప్రయత్నంగా.

"గడట, చిన్నపోయిందట...దొర రావన్నట... ఈ గడి నాశినమై పోతేం బోతంది...? ఇగో పంతులూ...! అయినె ఎందుకు రావద్దను కుంటనే దొర దొరంటున్నవు నువ్వు... గండ్లనే ఉంది కిటుకంత...? గిన్నేండ్లయినా, అయినిక్కడ లేకున్నా 'దొర' అనే అంటున్నవు నువ్వు... మేం గూడ... ఇగయనే గిక్కడికత్తె ఎట్లుండాలె...? గా దొరతనం మాకద్దనే రావద్దంటున్నం..."

గోపాలరావింకేం మాట్లాడదలుచుకోలేదు. వాళ్ళలో వాళ్ళ ఏవేవో మాట్లాడు కుంటున్నారు.

"దొర పోలీసులతో వత్తె ఏం జేత్తరు...?" అన్నాడు లింగయ్య.

"అట్లనా...? అయితె మంచిదేనాయె. అల్లతోని ఎన్రోజులు కాపుర ముంటడో ఉండనియ్యుండ్రి. ఇదువరకెంత మంది దొరలట్లరాలేదు...? ఎంత మంది పోలేదు...?"

అంతవరకు వాళ్ళ మాటలు వింటూ ఒక్క మాట కూడా మాట్లాడకుండా కూర్చొనున్న డెబ్బై ఏళ్ళ వృద్ధుడు రామయ్య అక్కన్నుంచి లేచి పోయిందెవరూ గమనించలేదు. కొద్ది సేపట్లో చేతిలో గునపంతో అక్కడున్నాడు రామయ్య.

"దొరచ్చి మల్ల రాజ్జెంచేత్తడా...? ఈ గడీలుండి ఊర్నేల్తడా...? నా బిడ్డ జీవితం నాశినం జేసిండు దొర. ఇన్రోజులు నేనెవ్వలతోని జెప్పకోలే. మానాని కాగలేక నూతిల పడి సచ్చిపెయింది నా బిడ్డ... నన్ను బంగారమోల చూసుకునేది నా బిడ్డ. నా బిడ్డుంటే నా కిరువయేండ్ల మనుమడుండు. .. మనుమరాలుండు... పెద్ద మనిషైన నా బిడ్డ బతుకును పాడుజేసిండు... గీ 'గడి'ల గట్లెందరి బతుకులు పాడైనయో ఇక్కడ గీ గడి ఉన్నదనే కద వత్తనంటండు. గీ ఇల్లుంజూసుకొనే కద వత్తనంటండు... గీ లంకన్నాశనం జేత్త... గీ గడిని కూలగొడత... నన్నెవ్వలాపుతరో అపుండ్రి... గిది కూలిపోతే దొర రాడిగ..."

దొరను తిడుతూ, ఏవేవో మాట్లాడుతూ, ఏడుస్తూ గునపంతో 'గడి' గోడలను పొడుస్తున్నాడు రామయ్య. తన బలాన్నంతా ఉపయోగించి గోడను పగలగొట్టడానికి ప్రయత్నిస్తున్నాడు. అంత పెద్ద ఇల్లును కూలగొట్టడం తన ఒక్కడి వల్ల కాదని తెలిసినా తన ప్రయత్నం తాను చేస్తున్నాడు. ఒక్కో మట్టిబెడ్డ రాలి కింద పడుతుంటే గోడను తవ్వుతూనే ఉన్నాడు రామయ్య.

అక్కడ కూర్చొనున్న వాళ్ళంతా లేచి నిల్చున్నారు. రామయ్య చేస్తున్న పని ఆశ్చర్యంగా చూస్తున్నారు. అతడెంత బలహీనంగా ఉన్నా అతనిలోని దృఢ నిశ్చయం అతడన్నంత పని తప్పకుండా చేస్తాడనిపిస్తుంది వాళ్ళకు.

కొద్ది సేపెవరేం మాట్లాడకుండా అలాగే చూస్తూ నిల్చున్నారు. ఇంకాగితే వచ్చే ప్రమాదాన్ని గ్రహించి అందులోంచి ఒకతను రామయ్య చేతిలోని గునపం గుంజుకున్నాడు.

"తాతా! నువ్వాగు... జేల్ల పొంటి, పోలీసు స్టేషన్ల పొంటి తిరిగి ఉన్నాం... పోలీసోల్లకు తెలిస్తె మనందర్ని పట్టుకపోతరు... ఊరంత అల్లకల్లోలమైతది. మనం

పోదాం రా. దొరెట్ల ఊళ్ళేకడుగు బెడతడో సూత్తా!" అని రామయ్యను తీసుకొని వెళ్ళిపోయాడు. అతని వెంటే మిగతా వాళ్లంతా వెళ్ళిపోయారు.

గోపాలరావొక్కడే అక్కడ మిగిలిపోయాడు.

జరుగుతున్న మార్పులు, చేజారుతున్న అధికారాలు, తారుమార వుతున్న పరిస్థితులను చూస్తుంటే గోపాలరావుకు వడ్లు పెరుగు కలిసినట్టనిపిస్తుంది. దొర, దొరలాంటి వాళ్ళిక ఊళ్ళోకి రాలేరన్న సత్యాన్నతడు జీర్ణించుకోలేకపోతున్నాడు. గతం వల్ల అతనికి పెద్దగా ఒరిగిందేం లేకున్నా గతమంతా జ్ఞాపకం వచ్చి అతని కళ్ళవెంట పట పటా నీళ్ళు కారుతున్నాయి. దొర దగ్గరి కెళ్ళి చెప్పాల్సిన విషయాల గూర్చి మననం చేసుకుంటున్న గోపాలరావుకు దుఃఖమాగడం లేదు.

పెద్దరువాజ దాటి బయటకొచ్చాడు గొపాలరావు. గడి దిక్కే వెనుకకెనుకకు చూస్తూ నడుస్తున్న గోపాలరావుకు ఆ గడి ఫెళ్ళు ఫెళ్ళున కూలిపోతున్నట్టనిపిస్తుంది.

● *'రచన' ఇంటింటి పత్రిక, ఆగస్టు 1995* ●

★ ★ ★